ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 11 జనవరి 2025



నేడు పెద్దలింగాపూర్‌కు కేంద్ర మంత్రి రాక

ఇల్లంతకుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌కు శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రానున్నట్లు బీజేపీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఆయుష్మాన్ భారత్ ప్రజా వైద్యశాల ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శనివారం దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ చేయనున్నట్లు, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కు మార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముస్తాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందన్నారు. పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, శీల ప్రశాంత్, భాను, కొమురయ్య, షాదుల్ పాషా, నర్సింలు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతం



- పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు
- గతేడాది సింగిల్ విండోల పెంపుపై నిర్ణయం
- ప్రతీ మండలానికి రెండు పరపతి సంఘాలు
- జిల్లాలో 2019లో కొత్తగా 5 సింగిల్‌విండోల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- తాజాగా 8 సంఘాల వరకు పెరిగే అవకాశం
- జిల్లాలో 24 సహకార సంఘాలు



సిరిసిల్ల కెడిసిసి బ్యాంక్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వ్యవసాయ సహకార పరపతి సంఘాల బలోపేతానికి కేంద్రం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సహకార రంగంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు విస్తృతంగా సేవలందిస్తున్నాయి. గత సంవత్సరమే కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇచ్చినా ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పునర్విభజన చేయాలని, ప్రతీ మండలానికి రెండు ఉండాలని సూచనలు చేసిన క్రమంలో అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం ఉన్న 24 సహకార సంఘాలను పెంచే దిశగా పరిశీలిస్తున్నారు. జిల్లాలో ఎనిమిది సింగిల్ విండోలు కొత్తగా పెరిగే అవకాశం ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను విభజించడంతో కొత్తగా మూడు జిల్లాలు ఏర్పడ్డాయి. కొత్త జిల్లాల్లో ఇప్పటి వరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను ఏర్పాటు చేయలేదు. దీనికి తోడుగా దాదాపు ఐదు సంవత్సరాల క్రితమే కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రతిపాదనలు కోరినా పెండింగ్‌లోనే ఉన్నాయి. 2019లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఐదు వ్యవసాయ ప్రాథమిక కేంద్రాలను ఏర్పాటు చేయడానికి పంపిన ప్రతిపాదనలకు ఈ సంవత్సరమైనా మోక్షం లభిస్తుందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మండలానికో రెండు సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు 25 రకాల సేవలు అందించాలని నిర్ణయించింది.

జిల్లాలో పెరగనున్న పరపతి సంఘాలు

జిల్లాలో గత సంవత్సరం మేలో కేంద్రమంత్రి మండలి నిర్ణయం మేరకైనా అన్నదాతలకు పరపతి సంఘాలు పెరుగుతాయని భావించినా ప్రతిపాదనలో అగిపోయాయి. జిల్లాలో ప్రస్తుతం 24సహకార సంఘాలు ఉండగా 74,728మంది సభ్యులు ఉన్నారు. ఓటుహక్కు కలిగిన వారు 35,776 మంది ఉన్నారు. గత ప్రభుత్వం మండలానికి రెండు సంఘాలు ఉండే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం జిల్లాలో 13 మండలాలు ఉండగా 24సహకార సంఘాలు ఉన్నాయి. కొత్తగా తంగళ్లపల్లి, మర్రిపల్లి, వట్టెంల, వీర్నపల్లి, గర్శనపల్లి, రుద్రంగి సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు గతంలో పంపించారు. కొత్త సంఘాలు ఏర్పడిన తర్వాత సింగిల్‌విండో ఎన్నికలు నిర్వహిస్తారని భావించిన కొత్త సంఘాలు ఏర్పడకముందే ఎన్నికల నిర్వహణ పూర్తి చేశారు. కొత్త సంఘాల ప్రతిపాదనలు మూలన పడ్డాయి.

మిగతా 8లో

ఫ్యాషన్ డిజైనింగ్‌కు కోర్సుకు డిమాండ్

● డాక్టర్ జి.జయ, ప్రిన్సిపాల్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

తంగళ్లపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయ అన్నారు. ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో కోర్సులు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : ఫైన్ ఆర్ట్స్ కళాశాల ఎప్పుడు ప్రారంభించారు? ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?

ప్రిన్సిపాల్: కళాశాల 2021లో ప్రారంభించారు. గిరిజన మహిళా డిగ్రీ కళాశాలకు అనుసంధానంగా కొనసాగుతోంది. రాష్ట్రంలోనే తొలి ఫైన్ ఆర్ట్స్ కళశాల. ప్రస్తుతం మొత్తం 247 మంది విద్యార్థులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : కళాశాలలో ఏ కోర్సులు ఉన్నాయి? ఒక్కో కోర్సులో ఎంత మందికి ప్రవేశం కల్పిస్తారు? ఎన్ని సంవత్సరాలు శిక్షణ తీసుకోవాలి?

ప్రిన్సిపాల్: మూడు కోర్సులు ఉన్నాయి. ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డిజైనింగ్, ఫొటో గ్రఫీ అండ్ డిజిటల్ ఇమేజింగ్ కోర్సులు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో 60 మంది, ఇంటీరియర్ డిజైనింగ్‌లో 40 మంది, ఫొటో గ్రఫీలో 20 మందికి ప్రవేశం కల్పిస్తున్నాం. మూడు సంవత్సరాల కోర్సు ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : ప్రవేశాల కోసం దరఖాస్తులు ఎలా చేసుకోవాలి?

ప్రిన్సిపాల్: ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. 90శాతం ప్రవేశాలు గిరిజన విద్యార్థులకు ఉంటాయి. ఇంటర్మీడియెట్ మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : కోర్సుల ద్వారా ఎలాంటి ఉపాధి అవకాశాలు ఉన్నాయి?

ప్రిన్సిపాల్ : ప్రైవేట్ కళాశాలలో ఈ కోర్సులు చేయాలంటే లక్షల్లో ఫీజులు కట్టాలి. ఖరీదైన కోర్సులు ఉచితంగా అందిస్తున్నాం. ఇంటర్న్‌షిప్‌లోనే 50 శాతం మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఆంధ్రజ్యోతి : అద్దె భవనంలో ఇబ్బందులు, సిబ్బంది కొరత వంటివి ఉన్నాయా?

ప్రిన్సిపాల్ : అద్దె భవనంలో కొనసాగుతున్నా మౌలిక వసతులన్నీ ఉన్నాయి. సిబ్బంది కొరత లేదు.



రాజన్న ఆలయంలో పెద్దసేవపై స్వామివారల ఊరేగింపు

వైభవంగా ముక్కోటి ఏకాదశి

- ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చిన స్వామివారలు
- వేములవాడకు పోటెత్తిన భక్తులు, హాజరైన ప్రభుత్వ విప్

7,8లో..



ఇల్లంతకుంటలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ముందస్తు సంక్రాంతి వేడుకలు

- పాఠశాలల్లో ముగ్గుల పోటీలు
- అలరించిన కైట్ ఫెస్టివల్

8లో..

సీఎం సమావేశంలో కలెక్టర్



సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల అమలుపై చర్చించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీవో కృష్ణహరి, నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. తాజా కూరగాయలు, పురుగులు లేని ఆహారం తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. హెచ్‌ఎం మనోహరాచారి, నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫిషరీష్ పరిశ్రమ ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచలో నిలిచిన ఫిషరీస్ పరిశ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో ఫిషరీఫ్ పరిశ్రమను ఏర్పాటుకు 600 ఎకరాలల భూమిని కొనుగోలు చేసిందని, కేవలం 300 ఎకరాలకు మాత్రమే పరిహారం చెల్లించిందని అన్నారు. మానేరు నీరు ఆ ప్రాంతంలో పుష్కలంగా ఉండడంతో మత్స్య సంపద అభివృద్ధి కోసం గత ప్రభుత్వం నిర్ణయించిందని, ఫిషరీష్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఆలోచన చేసిందని అన్నారు. పరిశ్రమతో నిర్వాసిత గ్రామాలకు చెందిన 10వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలపై అభిప్రాయాలు తెలపాలి

సిరిసిల్ల క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): క్యూ ఆర్ కోడ్ ద్వారా పోలీస్ సేవలపై ప్రజలు అభిప్రాయాలు తెలపాలని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. పోలీసుల పనితీరు, ప్రవర్తన, ఇతర సమాచారం తదితర అంశాలపై అభిప్రాయం తెలిపేందుకు రూపకల్పన చేసిన క్యూ ఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి పోలీసుల సేవలపై ప్రజా అభిప్రాయం తెలపాలన్నారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లు, డీఎస్పీ, సర్కిల్ కార్యాలయాల్లో, జిల్లా పోలీసు కార్యాలయంలోనూ క్యూ ఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్ ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ సేవలపై సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పోస్టర్‌లోని క్యూ ఆర్ కోడ్ లేదా లింక్ ఓపెన్‌చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రధానంగా ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్, ఈ చాలన్ ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్ట్ ధ్రువీకరణ, ఇతర అంశాలపై పోలీసు అధికారులు, సిబ్బంది స్పందనపై అభిప్రాయాలు తెలపాలన్నారు.



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

సిరిసిల్ల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జిల్లా విద్యాధికారిగా పనిచేసి నాగర్ కర్నూల్ జిల్లాకు బదిలీపై వెళ్లిన రమేష్‌కుమార్‌కు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో శుక్రవారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమేష్‌కుమార్‌ను సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తోందన్నారు. జిల్లాలో కొత్త కాలేజీలు, ప్రారంభిస్తామని, లేని మండలాలకు రెండు చొప్పున మంజూరు చేశామని తెలిపారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయాన్ని పోగొట్టే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని, 10 జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఎంఈవో రఘుపతి, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ లకావత్ మోతీలాల్, కో కన్వీనర్లు మార్వాడి గంగరాజు, విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రైల్వేలైన్ నిర్మాణ పనులకు భూసేకరణ సమస్య

● కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌రూరల్/భగత్‌నగర్, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): రైల్వేలైన్ పనులకు భూసేకరణ సమస్యగా మారిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి, కొత్తపల్లి రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం రైల్వే అభివృద్ధి కోసం భూసేకరణ విషయంలో అనుకున్నంతగా సహకరించడం లేదన్నారు. రైల్వేలైన్‌ల కోసం భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ భూసేకరణ సమస్య పరిష్కారం కాకపోవడంతో రైల్వేలైన్, ఆర్‌ఓబీ పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ పనులను 2027 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కరీంనగర్ రైల్వేస్టేషన్‌ను పూర్తిగా ఆధునికీకరించి మార్చి నాటికి అందుబాటులోకి రానుం దన్నారు. కొత్తపల్లి రైల్వేస్టేషన్ పనులు 60 కోట్లతో పూర్తి కానున్నాయ న్నారు. మూడు నెలల్లో ఉప్పల్ ఆర్‌ఓబీని అందుబాటు లోకి తెస్తామన్నారు. ఉప్పల్ ఆర్‌ఓబీ నిర్మాణ పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. రైల్వే స్టేషన్‌లలో జరుగుతున్న పనులను వేగవంతం చేయా లన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా మోదీ 25 వేల కోట్ల రూపాయలు వెచ్చించి 1,350 రైల్వే స్టేషన్లలను ఆధునికీకరించి ఆదర్శ స్టేషన్లుగా తీర్చి దిద్దుతున్నారన్నారు. సేతు బంధన్ స్కీం కింద 154 కోట్లతో కరీంనగర్ ఆర్‌ఓబి నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. ఆర్‌ఓబీ నిర్మాణంతో తీగలగుట్టపల్లి వద్ద రోడ్డు అధ్వాన్నంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచు కుని 36 లక్షల రూపాయలు మంజూరు చేయించా మన్నారు. కొత్తపల్లి స్టేషన్ వద్ద సరుకు రవాణా సౌకర్యాలతో కొత్తపల్లి జంక్షన్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. టెండర్లు పూర్తయి పనులు కొనసాగుతున్నాయన్నారు. మార్చి నాటికి ప్రారంభించాలనే లక్ష్యంగా పనులు చేస్తున్నామన్నారు.

సిరిసిల్ల- వేములవాడ వద్ద మానేరు నదిపై వంతెన నిర్మించ బోతున్నామని దీంతో ఈ మార్గంలో రైలు ప్రయాణం సులభమవుతుందన్నారు. కొత్తపల్లి- మనో హరబాద్ రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే మెదక్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వచ్చే నెలా ఖరు నాటికి ఉప్పల్ ఆర్‌ఓబిని అందుబాటులోకి తీసు కు రానున్నామన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి మున్సి పల్ చైర్మన్ రుద్ర రాజు, వాసాల రమేష్, కౌన్సిలర్లు, కొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ నమూనాను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

ముక్కోటి శోభ



కొండగట్టులో ఉత్సవమూర్తులు

- వైభవంగా వైకుంఠ ఏకాదశి
- ఉత్తర ద్వారం గుండా స్వామి వారలను దర్శించుకున్న భక్తులు

ధర్మపురి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి, వేములవాడ, కొండగట్టు ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారలను ఉత్తరద్వారం గుండా దర్శించుకున్నారు.

● ధర్మపురి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల మధ్య అర్చకులు ఉత్తర ద్వారం తెరిచారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు, ఎస్పీ అశోక్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తదితరులు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారందరికీ స్వామివారి శేషవస్త్రం కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పోలీసు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వేములవాడలో..

వేములవాడ కల్చరల్ : ముక్కోటి ఏకాదశి వేడుకలు వేములవాడ రాజన్న ఆలయంలో వైభవంగా నిర్వహించారు. ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం పార్వతిసమేత రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంతపద్మనాభస్వామి వారలను పల్లకి సేవపై ఉత్తర ద్వారా ప్రవేశం చేపట్టారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేకువ జామున వైభవంగా పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం చేశారు. దేవస్థానం తరపున పట్టువస్త్రాలను బహుకరించారు. ప్రత్యేకించి అలంకరించిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆలయ ఉత్తర ద్వారం వద్ద ప్రతిష్ఠించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్తరద్వారం గుండా ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి నీరజ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్య వేక్షకులు పాల్గొన్నారు.



వేములవాడలో పల్లకి సేవపై ఆలయంలోకి ప్రవేశిస్తున్న స్వామివారలు



ధర్మపురి లక్ష్మీనరసింహ ఆలయంలో స్వామివారి ఊరేగింపు



ధర్మపురిలో భక్తుల క్యూ



కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



రాజన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

శంకరపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఆముదాల పల్లి గ్రామ శివారులో శుక్రవారం కారు బైక్‌ను ఢీ కొట్టిన ప్రమాదం లో ఓ మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన సుజాత అనే మహిళ జమ్మికుంటలో ఉద్యోగం ముగించుకొని ఓ వ్యక్తితో స్వగ్రామానికి వెళ్తున్నది. ఈ క్రమంలో ఆముదాపల్లి గ్రామ శివారులో కారు బైక్‌ను ఢీ కొట్టడంతో వెనుక కూర్చున్న సుజాత కింద పడడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు సుజాతను కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ యువకులు

గన్నేరువరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను శుక్రవారం గన్నేరువరం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామశివారులో శుక్రవారం వాహనాల తనిఖీని నిర్వహించారు. రెండు బైకులపై ముగ్గురు యువకులు గునుకుల కొండాపూర్ వైపు వెళుతుండగా అనుమానించిన పోలీసులు తనిఖీ చేయగా వంద గ్రాముల గంజాయి లభించింది. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నోముల వివేక్, చిగురుమామిడి మండలం ముదిమా ణిక్యం గ్రామానికి చెందిన నిమ్మకంటి శివ, గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామానికి చెందిన కాట గణేశ్ అనే వ్యక్తుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రెండు బైకులు, మూడు ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు ఐదు వేల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ప్రయాణికులపైకి దూసుకువెళ్లిన లారీ

- ఒకరి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులపైకి ఓ లారీ దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకలువల ఎస్సీ కాలనీకి చెందిన కలువల శంకరమ్మ(45), నారాయణపూర్ గ్రామానికి చెందిన వేల్పుల సూరమ్మ బస్సు కోసం ఎదురుచూస్తుండగా, కరీంనగర్ వైపు నుంచి పెద్దపల్లి వైపు ఎరువుల లోడ్‌తో వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రయాణికుల పైకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కలువల శంకరమ్మ మృతిచెందగా, వేల్పుల సూరమ్మతో పాటు పెరుకపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు శ్రీనివాస్‌లు గాయపడ్డారు. వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కరీంనగర్ తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదాన్ని పరిశీలించారు.

పోచమ్మ మైదానంలోని నిర్మాణాల తొలగింపు

కోల్‌సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పోచమ్మ మైదానంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ముందున్న నిర్మాణాల ను శుక్రవారం సాయంత్రం నగరపాల క సంస్థ తొలగించింది. సుమారు రూ.8కోట్లతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ వినియోగం లోకి రాక మూలనపడి ఉంది. కాంప్లెక్స్ నిర్మాణానికి గతంలో పోచమ్మ మైదానంలో ఉన్న మున్సిపల్ మార్కెట్, సింగరేణి బ్యారెక్స్, ఐఎన్‌టీయూసీ కార్యాలయం తదితర షాపులను అప్పటి పాలకవర్గం తొలగించింది. తరువాత సింగరేణి ఆ స్థలాన్ని అధికారికంగా మున్సిపల్‌కు అప్పగించ డంతో డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఆ స్థలం చుట్టూ మున్సిపల్ ఫెన్సింగ్ కూడా వేసింది. తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టాదారులుగా చెప్పుకుంటున్న వారు ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు చేయడం, అప్పటి కమిషనర్ డీటీసీపీ అనుమతులు ఉన్న స్థలానికి ఎల్‌ఆర్ఎ స్‌లు, ప్రహరీ నిర్మాణ అనుమతులు ఇవ్వడం వివాదం రేపింది. కొందరు ఆ స్థలంలో భవనాలు నిర్మించారు. దీనిపై సింగరేణి ఎవిక్షన్ జరిపి షాపులను సీజ్ చేసింది. హైకోర్టులో సింగరేణి కేసు వేసింది. సింగరేణి ప్రభుత్వానికి అప్పగించిన ఈ స్థలంపై వివాదం కొనసాగుతూనే ఉన్నది. శుక్రవారం పోచమ్మ మైదానంలోని మున్సిపల్ కాంప్లెక్స్ ముందున్న నిర్మాణాలను కార్పొరేషన్ కూల్చివేసింది.



నిర్మాణాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం

- బాలల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అమ్మమ్మకు అప్పగింత
- ముగ్గురి నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న సన్నిధిలో గత నెల 23న కిడ్నాప్‌నకు గురైన నాలుగేళ్ల బాలిక కథ సుఖాంతమైంది. ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు బాలికను బాలల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆమె అమ్మమ్మకు అప్పగించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని చింతల పల్లికి చెందిన సింగారపు లాస్య మతిస్థిమితం కోల్పోయి భర్త మధుతో దూరంగా ఉంటోంది. లాస్య తన కూతురు సింగారపు అద్విత (4)తో కలిసి రాజన్న దర్శనానికి వచ్చింది. మహబూబాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు కూడా అదే సమయంలో రాజన్న దర్శనానికి వచ్చారు. లాస్యతో చనువుగా ఉండి అందరూ కలిసి రాజన్న సన్నిధిలో నిద్రచేసి మొక్కు లు తీర్చుకున్నారు. లాస్యకు మతిస్థిమితం సరిగా లేక బాలికను పట్టించుకోవడం లేదని గ్రహించిన వారు ఆ బాలికను దగ్గరికి తీసుకొని డిసెంబరు 23న ఎత్తుకెళ్లారు. బాలిక మేనమామ లాస్యను వెతుక్కుంటూ వేములవాడ వచ్చి ఆమెతో పాటు అద్విత లేక పోవడం గుర్తించాడు. తన కోడలు కనిపించడంలేదని డిసెంబరు 30న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. బాలిక తల్లి మతి స్థిమితం కోల్పోవడంతో, పోలీసులకు అవసరమైన సమాచారం అందించలేక పోయింది. బాలిక ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. వేములవాడతో పాటు వివిధ ప్రాంతాలలో, ముఖ్యంగా బస్టాండ్‌లలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. నిందితులు మహబూబాబాద్ జిల్లాలోని ఒక గ్రామంలో ఉన్న ట్లు తెలుసుకు న్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మిలట్రీ కాలనీకి చెందిన శ్రీరామోజీ వెంకటన ర్సమ్మ (50), గంభీరపు అంజవ్వ (40), అదే జిల్లాలోని మల్యాల గ్రామానికి చెందిన కున పురి ఉప్పలమ్మ(55) బాలికను అపహరించిన ట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని రిమాం డ్‌కు తరలించారు. లాస్య పరిస్థితి బాగా లేకపో వడంతో బాలిక అద్వితను జిల్లా కేంద్రంలోని బాలల సంరక్షణ సమితి చైర్మన్ కంటం అంజయ్యకు అప్పగించారు. ఈ మేరకు అనంతరం బాలిక అమ్మమ్మకు అధికారులు అప్పగించారు. కేసును ఛేదించిన వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సదన్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేశ్, జునైద్, కానిస్టేబుళ్లు తిరుపతి, రాజేశ్, అక్తర్, శ్రీనివాస్, మహిపాల్, ఇమ్రాన్, గోపాల్, బాబాయ్‌లను ఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ శివారు లో శుక్రవారం మంథని వైపు వెళ్తున్న బొలె రో వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంథని ప్రాంతం నుంచి పెద్దపల్లికి మంగపేటకు చెందిన రాజ్ కుమార్(20), అప్పన్నపేటకు చెందిన అభి లాష్(18) ఇద్దరు ద్విచక్రవా హనంపై పెద్దపల్లికి వస్తున్న తరుణంలో మంథని వైపు వెళ్తున్న బొలెరో వాహనానికి ఢీకొన డంతో రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృ తి చెందాడు. మరో యువకుడు అభిలాష్‌కు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించేలోపే మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. సంఘటనపై ఫిర్యాదు రాలేదని బసంత్‌నగర్ ఎస్ ఆర్.స్వామి తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

వీణవంక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చల్లూరు గ్రామ శివారులోని సబ్ స్టేషన్ స మీపంలో పేకాట ఆడుతున్నారన్న సమా చారం మేరకు శుక్రవారం దాడి చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఏడుగురిను అదుపులోకి తీసుకున్నామని, రూ. 15,600 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పేకాట ఆడితే చర్యలు ఉంటాయని తెలిపారు.

కోల్ ట్రాన్స్‌పోర్ట్‌లో గోల్‌మాల్



రాఘవాపూర్ రైల్వే సైడింగ్‌లో ఉన్న బొగ్గు కుప్పలు

రూ.10కోట్ల అవినీతికి తెరలేపిన కాంట్రాక్టర్

గోదావరిఖని, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): సింగరేణి నుంచి ఎన్‌టీపీసీకి బొగ్గు రవాణా చేసే ఓ కాంట్రాక్టర్ బొగ్గును కల్తీ చేసి రూ.10కోట్ల మేర అక్రమానికి పాల్పడిన సంఘటన ఆల స్యంగా వెలుగుచూసింది. ఎన్‌టీపీసీకి పెద్ద నిఘా నేత్రాలు, పకడ్బందీ క్వాలిటీ కంట్రోల్ వ్యవస్థలున్నా అన్నింటి కళ్లుగప్పి కేవలం రెండు మాసాల్లోనే రూ.10 కోట్లు దిగమింగాలని చూసిన కాంట్రాక్టర్ అవినీతిని ఎన్‌టీపీసీ పసి గట్టింది. ఇందుకు సంబంధించిన వివ రాలు ఇలా ఉన్నాయి... ఎన్‌టీపీసీ కర్ణాటకలోని కుడిగి విద్యుత్ సంస్థ అవసరాల కోసం సింగరేణి నుంచి నా లుగు మాసాల క్రితం బొగ్గు కొనుగోలు చేసింది. సింగరేణి ఈ బొగ్గును జీడీకే 5ఓసీపీ, జీడీకే 11ఇంక్లైన్ నుంచి సరఫరాకు కేటాయించింది. సింగరేణి నుంచి జీ10, జీ11 గ్రేడ్ బొగ్గును కుడిగి ప్రాజెక్టుకు ఎన్‌టీపీసీ తీసుకెళ్లాల్సి ఉంది. ఈ బొగ్గు రవాణా కోసం ఎన్‌టీపీసీ నాలుగు మాసాల క్రితం ట్రాన్స్ పోర్టు టెండర్ పిలిచింది. మహారాష్ట్రకు చెందిన ఒక కోల్ ట్రాన్స్‌పోర్టర్ ఈ టెండర్ దక్కించు కున్నాడు. 4లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయాల్సి ఉంది. బొగ్గు కేటాయించిన గనుల నుంచి రామగుండం సమీపంలోని రాఘవా పూర్ రైల్వే సైడింగ్ వరకు లారీల ద్వారా అక్కడి నుంచి రైలు మార్గం ద్వారా కుడిగికి కాంట్రాక్టర్ బొగ్గు

● రవాణా నిలిపివేసిన ఎన్‌టీపీసీ

పంపించాడు. లారీల ద్వారా రాఘవాపూర్ రైల్వే సైడింగ్ సమీపంలో బొగ్గును పోగు చేసుకుని అక్కడి నుంచి ట్రైన్‌లో పంపిస్తారు. ఇక్కడే కాంట్రాక్టర్ తన అవినీతికి తెరలేపాడు. సింగరేణి నుంచి వెళ్లిన జీ10, జీ11 బొగ్గులో కోల్ యాష్, కోల్ బతాని కలిపి ఎన్‌టీపీసీకి బొగ్గు రవాణా చేశాడు. ఇప్పటి వరకు 2లక్షల టన్నుల బొగ్గు సదరు కాంట్రాక్టర్ కర్ణాటక ఎన్‌టీపీసీ ప్లాంట్‌కు పంపించాడు. కుడిగి ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో ఏర్పడిన మార్పులను పరిశీలించిన ఎన్‌టీపీసీ క్వాలిటీ అధికారులు బొగ్గు కల్తీని గుర్తించారు. ఈ కాంట్రాక్టర్ ద్వారా సరఫరా అయ్యే బొగ్గును నెల రోజుల క్రితం నిలిపివేశారు. దీంతో ఈ బాగోతం వెలుగు చూసింది.

సింగరేణి జైపూర్ విద్యుత్ ప్లాంట్‌లో విద్యుత్ తయారీకి బొగ్గును వాడిన తరువాత బొగ్గు కొంత బూడిద రూపంలో కొంత బతానీ సైజులో మిగిలిన బయటకు వస్తుంది. ఈ బొగ్గును కూడా సింగరేణి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అమ్ముతుంది. ఈ బొగ్గు రూ.600లకు టన్ను చొప్పున గోదావరిఖనికి చెందిన ఒక కాంట్రాక్టర్ టెండర్ తీసుకుని అమ్ముతున్నాడు. రూ.600లకు టన్ను చొప్పున దొరికే ఈ కోల్ బతానిని కాంట్రాక్టర్ ఎన్‌టీపీసీకి బొగ్గు రవాణా చేసే బొగ్గులో కలిపి కర్ణాటకకు సరఫరా చేస్తున్నాడు. సింగ రేణి నుంచి కొనుగోలు చేసే బొగ్గు ధర టన్నుకు రూ.3వేలు ఉంటుంది. కానీ రూ.600లకే దొరికే ఈ కోల్ బతానిని అందులో కలిపి పంపిస్తున్నాడు. అంటే టన్నుకు రూ.2400 అక్రమంగా సంపాదించేందుకు కోల్ ట్రాన్స్‌పోర్టర్ తెరలేపాడు. ఇప్పటికి సరఫరా అయిన 2లక్షల టన్నులో సుమారు 40వేల టన్నులు నాసిరకం బొగ్గును కలిపి రవాణా చేసినట్టు తెలుస్తున్నది. బొగ్గు కల్తీ చేసి ఎన్‌టీపీసీకి పంపించడమే కాకుండా ఎన్‌టీపీసీ కోసం సింగరేణి నుంచి తెచ్చిన మేలు రకం బొగ్గును రాఘవాపూర్ నుంచే లారీల ద్వారా ప్రైవేట్‌గా అమ్ముకొని కూడా కాంట్రాక్టర్ సొమ్ము చేసుకునట్టు తెలుస్తున్నది. ఇదే రాఘవాపూర్ రైల్వే సైడింగ్ సమీపంలో ఒక ప్రైవేట్ బొగ్గు మాఫియా వేల టన్నుల నకిలీ బొగ్గును, బొగ్గు డస్టును, బొగ్గు బతానీని కుప్పలుగా పోసి అమ్ముతూ ఉంటుంది. ఈ మాఫియా నుంచి కూడా సదరు కోల్ ట్రాన్స్‌పోర్టర్ వేల టన్నుల బొగ్గును కొనుగోలు చేసినట్టు తెలిసింది.

● కోల్ వ్యాగన్ల క్లీనింగ్ కోసం టెండర్లు

రామగుండం రైల్వే స్టేషన్‌లో కోల్ వ్యాగన్ల క్లీనింగ్ కోసం టెండర్లు పిలుస్తారు. గతంలో రూ.కోటికి ఉన్న టెండర్ ఇప్పుడు రూ.2 కోట్లకు పెంచి ఒక కాంట్రాక్టర్ తీసుకున్నాడు. రైల్వే వ్యాగన్లు శుభ్రం చేస్తున్నప్పుడు టన్నుల కొద్దీ బొగ్గు మిగులుతుంది. ఆ బొగ్గును పోగుచేసి అమ్ముకుంటున్న కాంట్రాక్టర్ కూడా ఈ బొగ్గు ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌కు వేల టన్నుల బొగ్గును సరఫరా చేసినట్టు సమాచారం. వ్యాగన్లను క్లీన్ చేసే కాంట్రాక్టు తీసు కున్న కాంట్రాక్టర్ కూడా రైల్వే అధికారులు, సిబ్బం దిని మేనేజ్ చేసుకుని బొగ్గు సరఫరా ట్రైన్లను కొంత సేపు నిలుపుకుని టన్నుల కొద్ది బొగ్గును క్లీనింగ్ డస్ట్‌లో కలుపు కుని అమ్ముకుంటున్నట్లు పరిశీలనలో తేలినట్టు సమాచారం.

● కాంట్రాక్టర్‌పై చర్యలకు సిద్ధం

సింగరేణి ప్రాంతంలోని రాఘవాపూర్, రెబ్బెన, రేచిని, మంద మర్రి, బెల్లంపల్లి రైల్వే సైడింగ్‌ల్లో ఈ అక్రమ బొగ్గు దందా యథేచ్ఛగా కొనసాగుతున్నది. బొగ్గు రవాణాలో జరిగిన కల్తీపై ఎన్‌టీపీసీ యాజమాన్యం కాంట్రాక్టర్‌పై చర్యల కు సిద్ధమైంది. రాఘవాపూర్ రైల్వే సైడింగ్ నుంచి వచ్చిన బొగ్గులో కల్తీ జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని ఎన్‌టీపీసీ అధికారవర్గాలు తెలియ జేశాయి. దీనిపై పూర్తిస్థాయి విచా రణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. ఇక్కడి నుంచి సరఫరా అయ్యే బొగ్గు నిలిపివేయడంతో కుడిగి ఎన్‌టీపీసీ ప్రాజెక్టుకు అంతర్జాతీయ మార్కెట్ నుంచి బొగ్గు కొనుగోలు చేస్తున్నట్లు ఎన్‌టీపీసీ వర్గాలు తెలిపాయి. సింగరేణి యాజమాన్యం కూడా తమ మార్కెట్‌ను కాపాడుకునేందుకు బొగ్గు కల్తీపై దృష్టి సారించాల్సి ఉంది. సింగరేణి ప్రాంతంలోని రైల్వే సైడింగ్‌ల వద్ద కూడా సంస్థ ఎస్అండ్‌పీసీ, విజిలెన్స్ విభాగాలు బొగ్గు నాణ్యతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.




హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్

“ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు.”



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవీ చైతన్య



పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు





ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

ఎన్‌సీఆర్‌సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నల్మాసు ప్రభాకర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రభాకర్

మంథని, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంథనికి చెందిన నల్మాసు ప్రభాకర్ ఎన్నిక హైదరాబాద్‌లోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు నుంచి నియామకపు పత్రాన్ని శుక్రవారం అందుకున్నారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య వర్గాల వద్ద వినియోగదారులు నష్టపోకుండా చూస్తామన్నారు. తమ సంస్థ ద్వారా అధికారుల దృష్టికి వినియోగదారుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వారికి న్యాయం జరిగేలా పోరాడుతామన్నారు.


మారం తిరుపతికి డాక్టరేట్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జూలపల్లి మండలానికి చెందిన మారం తిరుపతి యాదవ్‌కు అమెరికా దేశానికి చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. రాష్ట్రంలో గొర్రెల కాపరుల స్థితిగతులు, ఆర్థిక ఎదుగుదల, మాంస ఉత్పత్తిలో నూతన పద్ధతులపై 12 ఏళ్లుగా పరిశోధన, అధ్యయనం చేస్తున్న క్రమంలో డాక్టరేట్‌ను శుక్రవారం అందజేశారు. తమిళనాడు రాష్ట్ర రాజధాని మద్రాస్ నగరంలో రాజ అన్నమలై మంద్రంలో యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ పి మాన్యువల్, వైస్‌చాన్స్‌లర్ రిటైర్డ్ తమిళనాడు హైకోర్టు జడ్జి డాక్టర్ కె. వెంకటేష్‌ల చేతుల మీదుగా తిరుపతికి అందించారు.



రేపు అక్షర యోధుడు అలిశెట్టి జయంతి, వర్ధంతి

కరీంనగర్ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యుదయ, యువ కవి అలిశెట్టి ప్రభాకర్. పేదరికంలో పుట్టి, పేదల తరఫున కవిత్వాన్ని రాసిన ప్రజాకవి. ప్రశ్నించే తత్వం ఎజెండాగా పలు సామాజిక అంశాలపై స్పందిస్తూ అద్భుత, ఆలోచనా పూరిత కవిత్వాన్ని పండించి ఆలోచింపజేశారు. జగిత్యాలలో జనవరి 12, 1956లో జన్మించిన ఆయన క్షయ వ్యాధితో బాధపడుతూ 1993 జనవరి 12న మృతి చెందారు. జయంతి, వర్ధంతి ఒకే రోజు కావడం యాదృచ్ఛికం. తొలుత ఆర్టిస్ట్‌గా కళా ప్రస్థానం ప్రారంభించి, అనంతరం కవిత్వ రంగంలో ప్రవేశించారు. జగిత్యాల, కరీంనగర్ లలో స్టూడియో నడుపుతూ కారణాంతర పరిస్థితుల వల్ల తన మకాంను హైదరాబాద్‌కు మార్చి చిత్రలేఖ స్టూడియో ప్రారంభించి కవిగా ఎదిగి పోయారు. సంపాదన కోసం చూడకుండా, ఓ దశలో ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా నిస్వార్థంగా చివరి శ్వాస వరకు అక్షర ప్రయాణం కొనసాగించారు. 1978లో ఎర్ర పావురాలు, 1979లో మంటల జెండాలు, 1981లో చురకలు, 1985లో రక్త లేఖ, 1989లో ఎన్నికల ఎండమావి, 1990లో సంక్షోభగీతం, 1992లో సిటీలైఫ్ కవితా సంకలనాలను వెలువరించారు.



- రేపు డాక్టర్ బెల్లి యాదయ్యకు అలిశెట్టి రాష్ట్రస్థాయి పురస్కారం

గత కొన్నేళ్లుగా తెలంగాణరచయితల వేదిక ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్‌సి నారదాసు లక్ష్మణరావు శాశ్వత పురస్కార ప్రదాతగా అందించే అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికి ఆదివారం ఉదయం 10 గంటలకు ఫిలింభవన్‌లో నల్లగొండ జిల్లా కవి డాక్టర్ బెల్లి యాదయ్యకు అందజేయనున్నారు.

ఓసీపీ బ్లాస్టింగ్‌లపై విఠల్‌నగర్‌వాసుల ఆగ్రహం



ఓసీపీ-5కి వెళుతున్న కాలనీవాసులు, కార్పొరేటర్

కోల్‌సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓసీపీ-5లో మోతాదుకు మించి బ్లాస్టింగ్‌లు చేయడం వల్ల తమ ఇండ్లకు పగుళ్లు వస్తున్నాయని, దుమ్ముతో వ్యాధులు వస్తున్నాయంటూ కార్పొరేటర్ బొడ్డు రజిత ఆధ్వర్యంలో కాలనీవాసులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఓసీపీ-5 సైట్ ఆఫీస్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. పీవో రావాలంటూ స్థానికులు బైఠాయించారు. ప్రాజెక్టు అధికారి స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా మోతాదుకు మించిన బ్లాస్టింగ్‌లు తగ్గించాలని, బొగ్గు ఓవర్ లోడ్‌తో వెళ్లడం వల్ల దుమ్ముధూళి వస్తుందని, గ్రీన్ క్లాత్ కట్టించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని పీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొడ్డు రవీందర్, బొబ్బిలి సతీష్, తోడేటి శంకర్‌గౌడ్, బాబు, శ్రావణ్, పవన్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

మంథని, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఫిబ్రవరి నెలలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు 18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.50లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, వీటిపై మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు బూడిద గణేష్, అమృత, విజయ, స్వప్న, సునీత, కళ్యాణి, మల్లేశ్వరి, రమలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సాకులు చెప్పి తప్పించుకుంటే చర్యలు తప్పవు

- రైల్వే సమీక్షా సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): రైల్వేలైన్, ఆర్‌ఓబీల నిర్మాణంలో సాకులు చెప్పి తప్పించు కుంటూ జాప్యం చేస్తే చర్యలు తప్పవని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయంలో రైల్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఓబీల నిర్మాణంతో జాప్యంపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఉప్పల్ ఆర్‌ఓబీ నిర్మాణం మార్చిలోపు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవన్నారు. తీగలగుట్టపల్లి ఆర్‌ఓబీ అడ్డంకులన్నీ వెంటనే పరిష్కరించాలన్నారు. ఇకపై ప్రతి నెలా రైల్వే ప్రాజెక్టులపై సమీక్షిస్తామని, జాప్యం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. నిర్ణీత గడువులోగా ఆయా ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జమ్మికుంట ఉప్పల్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల్లో ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్నారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తీగల గుట్టపల్లి ఆర్‌ఓబీ పనుల జాప్యంపై ఫిర్యాదులు వస్తునే ఉన్నాయని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూసేకరణ, ఎలక్ట్రికల్, రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు మంజూరు కావడం లేదని అధికారులు బదులివ్వడంతో ఇవన్నీ ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయా వెంటనే పరిష్కరించాలన్నారు. తీగలగుట్టపల్లి ఆర్‌ఓబీ నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కరీంనగర్ రైల్వేస్టేషన్ పనులు 80 శాతం పూర్తయినట్లు తెలుసుకుని అభినందిం చారు. కరీంనగర్- హసన్‌పర్తి రైల్వేపై ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ఆరా తీశారు. గ్రానైట్ రవాణా అంతా ప్రస్తుతం పెద్దపల్లి మీదుగా పోర్టుకు వెళ్తాయని, కరీంనగర్ హసన్‌పర్తి రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే దూర భారం తగ్గుతుందన్నారు. కరీంనగర్ నుంచి రైస్ ఎగుమతి కూడా లైన్ ద్వారా తీసుకెళ్ల వచ్చన్నారు. తిరుపతి వెళ్లే లైన్‌ను కరీంనగర్ హసన్‌పర్తి మీదుగా మళ్లిస్తే ప్రయాణికులకు సమయం ఆదా అవుతుందన్నారు. త్వరలోనే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రైల్వేలైన్ నిర్మాణంపై ప్రకటన చేస్తారన్నారు.

అయ్యప్ప భక్తులకు నాందేడ్ నుంచి ప్రత్యేక రైలు

కరీంనగర్ రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష ముగించుకుని శబరిమలై వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైలును నడుపుతోంది. శుక్రవారం నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా కొల్లం వరకు ప్రత్యేక రైలు రాగా కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో అయ్యప్ప మాలధారులు భారి సంఖ్యలో ప్రయాణించారు. ఈ రైలు నాందేడ్‌లో శుక్రవారం ఉదయం 5.30 నిమిషాలకు బయలు దేరగా, 12గంటలకు కరీంనగర్‌కు చేరుకుంది. రైలు కొల్లంకు శనివారం రాత్రి 7గంటలకు చేరుకుటుందని రైల్వే అధికారులు తెలిపారు. తిరిగి మళ్లీ కొల్లం నుంచి సోమవారం ఉదయం 2.30 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 8.40నిమిషాలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది. నాందేడ్‌కు మధ్యాహ్నం 3.30 నిమిషాలకు చేరుకుం టుందని తెలిపారు. అయ్యప్ప మాలధారుల కోసం ఈనెల 5న, 10వ తేదీన రెండుసార్లు ప్రత్యేక రైలును నడిపించింది.



కరీంనగర్‌లో నాందేడ్ నుంచి వచ్చిన ప్రత్యేక రైలు

భర్తపై అదనపు కట్నం కేసు

చందుర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భార్యను వేధించిన సంఘటనలో భర్తపై కేసు నమోదు చేసి నట్లు ఎస్సై అంజయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన మెరుపుల మధులత అలియాస్ నిఖిత వివాహం మర్రిగడ్డకు చెందిన మెరు పుల వెంకటేష్ తో 2011లో జరిగింది. వివాహ సమయంలో రూ2లక్షలు, రెండు తులాల బంగారంతోపాటు ఇతర లాంఛ నాలు ఇచ్చా రు. రెండేళ్ల నుంచి అదనంగా మరో లక్ష రూపాయల కట్నం తీసుకురా వాలని వేధిం పులు మొదలుపెట్టాడు. ఈ నెల 8న ఇంట్లో నుండి వెళ్లగొట్టాడు. మధులత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి



సిరిసిల్లలో స్వామివారిని దర్శించుకుంటున్న విప్ ఆది శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ధనుర్మాసోత్సవం.. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సిరిసిల్ల లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారు ఉత్తరద్వార దర్శనం ఇచ్చారు. అనంతరం గరుడ వాహనంపై ఊరేగించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వేంకటేశ్వరస్వామి దేవాలయం కిటకిటలాడింది. గరుడ వాహనంపై స్వామివారి శోభాయాత్ర పెద్దబజార్ మీదుగా సాగింది. ఉత్తర ద్వార దర్శనంలో స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దర్శించుకున్నారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన పాల పంపిణీని ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, నాయకులు, అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని రామలింగేశ్వరస్వామి, సీతారామాంజనేయ, లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ఉత్తర ద్వారం దారా స్వామివారిని దర్శించుకున్నారు. ప్యాక్స్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, సీతారామచంద్రస్వామి, సాయిబాబా ఆలయాల్లో కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దర్శించుకున్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వైకుంఠ ఏకదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వేములవాడ కల్చరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ రాజరాజేశ్వరస్వామిని శుక్రవారం తెల్లవారుజామున పార్వతిరాజరాజేశ్వర స్వామి, లక్ష్మీఅనంత పద్మనాభస్వామి వారలను దర్శించుకున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, చందుర్తి మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ స్వామి వారలను దర్శించుకున్నారు.

● వేములవాడ: రాజరాజేశ్వర స్వామిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వేములవాడ రూరల్: మండలంలోని ఎదురుగట్ల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సంపేట గంగరాజు, మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, సోయినేని లహరి, వైస్ చైర్మెన్లు రాఘవరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి సీతారాముల ఆలయం, నాగారం కోదండ రామస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం మామిడిపల్లి సీతారామస్వామిని రథంపై ఊరేగించారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతోపాటు మల్యాల, మూడపల్లి, బండపల్లి వేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించారు. మహాలక్ష్మి అలయ కమిటీ చైర్మన్ బాశెట్టి బాస్కర్, గౌరవ అధ్యక్షుడు బాటశెట్టి మౌళయ్య, కార్యదర్శి చిలుముల గోపాల స్వామి తదితరులు ఉన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఆలయ చైర్మన్ కొమిరె శంకర్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, దువ్వాక సత్తయ్య, నారావేణి సత్తయ్య, పడాల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సహకార సంఘాల బలోపేతం

5వ పేజీ తరువాయి..

కేంద్రప్రభుత్వం కొత్త సంఘాల ఏర్పాటుకు నిర్ణయించడంతోపాటు రాష్ట్రప్రభుత్వం కూడా కేంద్ర సహకార బ్యాంక్‌సేవలను అందుబాటులోకి తెచ్చేవిధంగా ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేసే ఆలోచనకూడా చేసింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో కొత్తగా ఏర్పడిన మండలాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, రుద్రంగి, వేములవాడ రూరల్ మండలాలతోపాటు గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనల మేరకు ఎనిమిది సింగిల్ విండోలు పెరుగుతాయని భావిస్తున్నారు. రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీకి సింగిల్ విండోలు తోడ్పడుతున్నాయి. వీటిని బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం, గత రాష్ట్ర ప్రభుత్వం భావించినా ఫలితాలు నామమాత్రంగానే మారాయి. ఈ సారైనా సింగిల్ విండోలు బలోపేతం అవుతాయని భావిస్తున్నారు.

సొసైటీల్లో 74,728 మంది సభ్యులు

జిల్లాలో ప్రస్తుతం 24 సంఘాలు ఉన్నాయి. సంఘాల పరిధిలో 74,728 మంది సభ్యులు ఉన్నారు. సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 12,859 మంది సభ్యులు ఉండగా పెద్దూరు సొసైటీలో 1336 మంది, నేరెళ్ల సొసైటీలో 1257, కోనరావుపేట సొసైటీలో 6196, కొలనూరు సొసైటీలో 3018, వేములవాడ సొసైటీలో 8180, నాంపెల్లి సొసైటీలో 1191, రుద్రవరం సొసైటీలో 998, చందుర్తి సొసైటీలో 3369 మంది, ననుగుల సొసైటీలో 1733, బోయినపల్లి సొసైటీలో 910, కోరెం సొసైటీలో 1694, మాన్వాడ సొసైటీలో 1163, నర్సింగాపూర్ సొసైటీలో 1684, ఇల్లంతకుంట సొసైటీలో 3547, గాలిపెల్లి సొసైటీలో 1680, ముస్తాబాద్ సొసైటీలో 2082, పోతల్ సొసైటీలో 7169, గంభీరావుపేట సొసైటీలో 8183, కొత్తపెల్లి సొసైటీలో 3680, ఎల్లారెడిపేట సొసైటీలో 3864, అల్మాస్‌పూర్ సొసైటీలో 2139, తిమ్మాపూర్ సొసైటీలో 1597, మానాల సొసైటీలో 199 మంది సభ్యులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

చందుర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం బండపల్లి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయ అర్చకులు కొడమగుళ్ల శ్రీకాంతచార్యుల ఆధ్వర్యంలో ప్రతీరోజు వేకువజామున తిరుప్పావై ప్రవచనాలను వినిపించారు.

నియామకం

సిరిసిల్ల టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సిరిసిల్ల నియోజకవర్గం కన్వీనర్‌గా వెంగళ శ్రీనివాస్‌ను నియమిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్‌రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో శ్రీనివాస్‌ను ఫోరం సభ్యులు బీఆర్ఎస్ నాయకులు అభినందనలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు కనకయ్య, రాష్ట్ర కళాకారుల సంఘం కన్వీనర్ పోశెట్టికి కృతజ్ఞతలు తెలిపాడు.

వ్యసనాలకు బానిసలు కావద్దు

ఇల్లంతకుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): యువకులు వ్యసనాలకు బానిసలు కావద్దని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. మండలంలోని వంతడుపులలో శుక్రవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సమయాన్ని వృథా చేయకుండా పోటీపరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఎస్సై కదిరె శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో బోరుబావి

తంగళ్లపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ, గ్రామ పంచాయతీ పరిధిలోని ఐదో వార్డులో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన బోరుబావికి కాంగ్రెస్ సోషల్‌మీడియా జిల్లా ఇన్‌చార్జి మధుకర్ శుక్రవారం భూమి పూజ చేశారు. సహకరించిన పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్య క్షుడు ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శ్రీరాంనరేష్, శ్యాం పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌తోపాటు ఉద్యోగుల డైరీలను కరీంనగర్‌లో శుక్రవారం కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌కుమార్, ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీవోఎస్ అధ్యక్షుడు సమరసెన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం

చందుర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మూడపల్లిలో రెడ్డి కుల సంఘం కార్య వర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా బద్దం భాస్కర్ రెడ్డి, సెక్రటరీగా తిరుమల్ రెడ్డి, క్యాషియర్‌గా అనంతరెడ్డి ఎన్నికయ్యారు.

18 వేల రూపాయల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి



ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

వేములవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలకు 18 వేల రూపాయల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల డిమాండ్ చేశారు. శుక్రవారం వేములవాడలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇంటి ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం 18 వేల రూపాయలు ప్రకటించాలని కోరారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడడం కోసం ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా పని చేస్తూ సేవలందిస్తున్న తమకు పనికి తగ్గ పారితోషికం ఇవ్వకుండా వెట్టిచాకిరికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. జిల్లాలో పెండింగ్ సర్వేలకు సంబంధించి ఆశా వర్కర్లకు రావాల్సిన లెప్రసి, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీలు, పీఆర్‌సి బకాయిలను అధికారులతో మాట్లాడి ఇప్పించాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ప్రమోషన్లు కల్పించాలని ఏఎన్ఎం పోటీ పరీక్షల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని అన్నారు. గత సంవత్సరం 15 రోజుల సమ్మె హామీలను మంజూరు చేయాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక రాజన్న ఆలయం వద్ద ఆశా వర్కర్లు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేష్, గుర్రం అశోక్, గురజాల శ్రీధర్, ముక్తికాంత అశోక్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు భారతి, లత, గాయత్రి, జమున, లావణ్య, చంద్రకళ, భూలక్ష్మి, రుచిత, జయశీల, గీత, కస్తూరి, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేములవాడ పట్టణ అభివృద్ధికి కృషి



భవనం ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 19 వార్డులో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ సంఘం భవనాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కుల సంఘాల భవనాలు సమస్యల పరిష్కా రానికి వేదికలుగా నిలుస్తాయన్నారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని, గుడి చెరువు లోనూ, మూలవాగులోనూ మురికి నీరు కలవకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గుడి చెరు వులోకి మురుగునీరు కలవకుండా మరో రూ.2 కోట్ల 30 లక్షల నిధులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. అంబేద్కర్ జంక్ష న్ సుందరీకరణలో భాగంగా కాంస్య విగ్ర హం ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగు తోందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ కుమ్మరి శిరీష, శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కుమ్మరి శంకర్, కౌన్సిలర్ సిరిగిరి రామచంద్రం, ఇప్పపూల అజయ్, నాయకులు కూర గాయల కొమురయ్య, పుల్కం రాజు, అన్నారపు శ్రీనివాస్, తోట రాజు, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేములవాడలో కాటిరేవుల మహోత్సవం



హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో రేణుక ఎల్లమ్మ వద్ద మహాలక్ష్మి రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాటిరేవుల మహోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు.. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం ఎడ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అనాదిగా వస్తున్న కాటిరేవుల పండగను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రైతులు ఎడ్లను పశుసంపదను తమ ఆస్తిగా భావిస్తారని తెలిపారు. ఎ ఎడ్లను దైవంగా భావించి పూజలు చేస్తారన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి



తారకరామానగర్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

సిరిసిల్ల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంఈవో రఘుపతి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని తారకరామానగర్ మండల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. అనంతరం ముందస్తు సంక్రాంతి వేడుకలు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్, ప్రధానోపాధ్యాయిని భారతి పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివెల్, కైట్ ఫెస్టివెల్ నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతీ సంప్రదాయాలు, సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను తెలిపే విధంగా వివిధ రకాల వంటకాలు తయారు చేశారు. అబ్బాయిలు పతంగులను ఎగుర వేశారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి బహుమతులను అందజేశారు.

చేనేత అభయ హస్తంలో పథకాల అమలుకు నిర్ణయం

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేనేత, మర మగ్గాల కార్మికులు అనుబంధ రంగాల కార్మికుల సంక్షేమం కోసం జీవో 3తో తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా మూడు పథకాలను అమలు చేసేందుకు నిర్ణయించి నట్లు చేనేత జౌళి శాఖ అధికారులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. నేతన్న పొదుపులో చేనేత, మరమగ్గాల కార్మికులకు కాలపరిమితి 36 నెలల నుంచి 26 నెలలకు తగ్గించినట్లు తెలిపారు. చేనేత కార్మికులు తమ వేతనంలో 8 శాతం జమ చేస్తే ప్రభుత్వం వాటా 16 శాతం జమ చేస్తుందని, అదే విధంగా మరమగ్గాల కార్మికులు తమ వేతనంలో 8 శాతం జమ చేస్తే ప్రభుత్వం 8 శాతం వాటా జమ చేస్తుందని పేర్కొన్నారు. కార్మి కుడి వాటా గరిష్ఠంగా రూ.1200 జమ చేసుకోవడానికి అర్హులని తెలిపారు. నేతన్న భద్రతలో చేనేత, మరమగ్గాల కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే నామినికి రూ. 5 లక్షలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. వృత్తిలో ఉండి వయస్సుతో సంబంధం లేకుండా ఉన్న కార్మికులకు ఈపథకాన్ని వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. నేతన్న భరో సాలో చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.18 వేలు, చేనేత అనుబంధ రంగాల కార్మికులకు రూ.6వేలు అందించనున్నట్లు ప్రకటించారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

ఇల్లంతకుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరులో రైతులకు ఎరువుల వినియోగంపై శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం తగ్గుతుందన్నారు. వ్యవసాయశాఖ సూచనలుపాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ మదన్‌మోహన్ రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, జాఫర్‌మక్బూల్, నిఖిల్ పాల్గొన్నారు.

హిందీభాషా దినోత్సవం

సిరిసిల్ల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ హిందీభాషా దినోత్సవం నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ హిందీ బాషా గొప్పతనాన్ని వివరించారు.

మాజీ సీఎంను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



కేసీఆర్, కేటీఆర్‌తో సిరిసిల్ల బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎరవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావును సిరిసిల్ల బీఆర్ఎస్ నేతలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి కేటీఆర్‌ను సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సందీప్ మర్యాద పూర్వకంగా కలిశారు.

బాల కార్మికులను బడిలో చేర్పించాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట శివారులోని ఇటుక బట్టీల వద్ద ఇటీవల విద్యాశాఖ అధికారులు సర్వేలో 28 మంది బడీ ఈడు పిల్లలను గుర్తించారు. అక్కడే ఇటుక బట్టీల యజమాని ఎండీ అన్వర్‌తో వర్క్‌సైట్ స్కూల్‌ను ఏర్పాటు చేయించారు. శుక్రవారం ఆ బడిని డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా ఇటుక బట్టీల వద్ద కూడా యజమానులు వర్క్ సైట్ స్కూళ్లను ఏర్పాటు చేసి ప్రారంభించాలని లేకుంటే దగ్గరలోని పాఠశాలలకు ప్రత్యేక వాహనాల్లో తరలించి బడీడు పిల్లలందరూ చదువుకునేలా కృషి చేయాలని కోరారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి

రుద్రంగి, జనవరి 10(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం కమిటీ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. మార్కెట్‌లో ఇబ్బందులను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. వైస్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీలో ఎస్సైపై ఫిర్యాదు

ముస్తాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ ఎస్సై సీహెచ్ గణేశ్‌పై హైదరాబాద్‌లోని హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు ఎండీ నవాజ్ శుక్రవారం తెలిపారు. గత నెలలో గురుకుల విద్యాలయాన్ని సందర్శించేందుకు వెళ్తే స్థానిక ఎస్సై గణేశ్ దురుసుగా ప్రవర్తించారని, కాలర్ పట్టుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల కోసం పోరాడితే బెదిరించారని ఆరోపించారు.

మైనంపెల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ముస్తాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గూడెంలో పార్లమెంట్ కో కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్నేని అంజనేయరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే మైనంపెల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, బొప్ప విష్ణు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద రైతులకు రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు అందిస్తామని ప్రకటించినా అమలు చేయడంలో విఫలమైందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గన్నారపు నర్సయ్య, మల్లారపు అరుణ్‌కుమార్, అన్నల్‌దాస్ గణేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు పెద్దూరు వాసులు

సిరిసిల్ల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో సర్వే నంబరు 408లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించారనే నెపంతో శుక్రవారం పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు శివారులోని రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా పట్టా చేసుకోవడంతోపాటు సాగు చేస్తున్నారని ఇటీవల గ్రామానికి చెందిన పలువురు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆ భూములపై విచారణ చేపట్టి వివరాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెండు రోజులు క్రితం రెవెన్యూ అధికారులు ఆ ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని అక్రమించారని గుర్తించి నివేదికను అందించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయనున్నట్లు సమాచారం.

యూత్ డిక్లరేషన్ అమలుచేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎన్నికలల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయస్సు పెంచే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రాజనీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏటా 2లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామని, జాబ్‌క్యాలెండర్ ద్వారా నియామకాలు చేపడతామని, నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇస్తామని యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌చంద్ర పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



వేములవాడలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సిరిసిల్ల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని నెహ్రూనగర్ మండల ప్రాథమిక పాఠశాలతోపాటు సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. బాలురు గాలిపటాలను ఎగురవేసి సందడి చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనజకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మడుపు నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు ఆకట్టుకున్నాయి. పాఠశాలల ఆవరణలో భోగిమంటలు వేసి విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయినులు ప్రేమలత, తూముకుంట శ్రీనిధి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం సారంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు నాయకుడుగుగ్గిళ్ల శరత్‌గౌడ్ బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజేశ్, ఉపాధ్యాయిని ప్రశాంతి, కావ్య, కోల శ్రీనివాస్, గుగ్గిళ్ల అభిషేక్, గుగ్గిళ్ల హరికృష్ణ, కోల శ్రావణ్, సిరిసిల్ల సాయితేజ, కోల రోహిత్, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేటమండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినులు వేసిన రంగవల్లులు హరివిల్లును తలపించాయి. బాలురు గాలిపటాలను ఎగుర వేశారు.

వేములవాడ: స్థానిక శ్రీసరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థులు కోలాటం,రంగవల్లులు, గాలిపటాలతో సంబరాలు జరుపుకు న్నారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ మనోహర్, సమితి కార్యదర్శి గర్మకుర్తి వెంకటేశ్వర్లు, ప్రధానాచార్యులు చిలుక గట్టు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బూర ఉమా ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయినులు, విద్యార్థినులు ముగ్గులను వేశారు. విద్యార్థులు గాలిపటాలను ఎగరవేసి సంబరాలను జరుపుకున్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నర్సింగాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్యాలలోని సాధన ఇంగ్లీష్ మీడియంలో విద్యార్థులకు ముగ్గుల, పతంగుల పోటీలను నిర్వహించారు. ఏఈవో వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు జితేందర్, కరస్పాండెంట్ రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.